## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ చందమామ, దుర్గానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఐడీఏ నాచారం 09,10, చందమామా ప్రెస్‌లైన్, ఐడీఏ నాచారం రోడ్‌నెంబర్ 18లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. టెక్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ జీవీకే ఫీడర్, స్టాడర్ టైల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు వీవీ ఇండస్ట్రీస్, సీఎఫ్‌సీలైన్, క్లాసిక్‌టైల్స్, ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్-14, ఐడీఏ మల్లాపూర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటబొమ్మల అందజేత



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధి అశోక్‌నగర్, చాణక్యపురి కాలనీ, మల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు ఆడుకోవడానికి ఆటబొమ్మలను బీజేపీ మహిళా నాయకురాలు పోకల నిర్మల, జ్ఞానేశ్వర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వారికి అవసరమైన వస్తువులను అందజేయడానికి మరింత మంది దాతలు ముందుకురావాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

## సన్నబియ్యం పథకం పేదల పాలిట వరం



లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం పేదల పాలిట వరమని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. విరాట్‌నగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో శనివారం ఆమె కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ దిశగానే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి ముందుకెళ్తున్నామన్నారు. నాగిళ్ల బాల్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

## కార్పొరేటర్ పర్యటన



ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో పర్యటించారు. శనివారం స్థానిక సమస్యలపై వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ.. అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కాలనీల్లో సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కాలనీ అధ్యక్షుడు వాసుచారి, నరేష్, అరుణ్, శ్రీకాంత్‌గౌడ్, రవి, శంకర్ తదితరులున్నారు.

## న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు




న్యాయమూర్తులను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాలభాస్కర్, పోక్సో న్యాయమూర్తి కిరణ్‌కుమార్, రెండో అదనపు సివిల్ జడ్జి మురళీమోహన్‌లకు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు అందించిన న్యాయసేవలను కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, బాపిరెడ్డి, మాధవి తదితరులున్నారు.

# వెల్లువలా దరఖాస్తులు !

**రాజీవ్ యువ వికాసం పథకానికి 66,648 దరఖాస్తులు**

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 24,610 యూనిట్ల మంజూరు
- రెండు దశల్లో దరఖాస్తుల పరిశీలనకు యంత్రాంగం కసరత్తు
- జూన్ 2న లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసేందుకు చర్యలు




రెండు దశల్లో దరఖాస్తుల పరిశీలన..

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాయితీ రుణాల కోసం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 66,648 దరఖాస్తులు వచ్చాయి. గడువు పొడిగించాలని పలు విజ్ఞప్తులు వచ్చినా గతంలో ఒకసారి పొడిగించినందున ప్రభుత్వం మరో అవకాశం ఇవ్వలేదు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ అవకాశం కల్పించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల వారీగా భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. రూ.50 వేల వరకు 100 శాతం రాయితీ ఉండగా.. రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం, రూ.1,00,001 నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంకు రుణం. రూ.2,00,001 నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం అందజేస్తోంది.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల్లో అర్హులు, అనర్హులు ఎవరనేది నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీతో విచారణ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో పురపాలికల్లో కమిషనర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేయనుంది. సభ్యులుగా బ్యాంక్ మేనేజర్, ఐకేపీ ఏపీఎం, సంబంధిత కార్పొరేషన్ ఉద్యోగి కమిటీలో ఉంటారు.

◆ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లను ఖరారు చేయనున్నారు. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. అందులో ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. దివ్యాంగులకు మరో 5 శాతం కేటాయిస్తారు.

◆ క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం అర్హులను తేలుస్తారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదంతో కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2న) రుణం మంజూరు పత్రాలను అర్హత పొందిన లబ్ధిదారులకు అందజేయనున్నారు.

**ప్రతులు తప్పనిసరిగా..**

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారు ఒక ప్రతిని డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలను జతచేసి ఎంపీడీఓ, పురపాలక సంఘాల కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వదిలేశారు.

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో 25 శాతం మంది సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు ప్రతులను అందజేయలేదు. ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలను తప్పనిసరిగా సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల జిల్లా అధికారులు కోరుతున్నారు.

**శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..**

1) బీసీ, ఈబీసీల నుంచి అందిన దరఖాస్తుల సంఖ్య 37,935 , మంజూరైన యూనిట్లు 13,400
2) ఎస్సీల నుంచి అందిన దరఖాస్తుల సంఖ్య 16,300, మంజూరైన యూనిట్లు 6,201
3) ఎస్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 2,196, మంజూరైన యూనిట్లు 1,594
4) క్రిస్టియన్ మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తులు 10,217, మంజూరైన యూనిట్లు 3,415

# జీసస్ చూపిన దారిలో నడవాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- ఉల్లాసంగా 'రన్ ఫర్ జీసస్'



సుభాష్‌నగర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మల్కాజిగిరిలో..

అల్వాల్: ఈస్టర్ ఫెస్టివల్ సందర్భంగా సుభాష్‌నగర్‌లో 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపించిన బాటలో నడవాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నవీన్, డేవిడ్, సుధాకర్, సాలమన్, మోసెస్, శేఖర్, అబ్రహం, వేణునాథం, స్థానిక నేతలు అనిల్‌కిషోర్‌గౌడ్, ప్రభాకర్ తదితరులున్నారు.

**పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

గౌతంనగర్: ఈస్టర్ వేడుకల్లో భాగంగా మల్కాజిగిరి పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌లో శనివారం 'రన్ ఫర్ జీసస్' వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఆలపించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్లు శామ్యూల్, ఏలియా, సంతోష్ తదితరులున్నారు.

**శాంతి ర్యాలీ..**

మల్కాజిగిరి: పాస్టర్ రాజు ఆధ్వర్యంలో నేరెడ్‌మెట్ నుంచి మల్కాజిగిరి వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. మల్కాజిగిరి చౌరస్తాలో ప్రార్థన నిర్వహించారు. ర్యాలీలో జాతీయ క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు సంజీవరావు, వివిధ చర్చిల పాస్టర్లు జాన్‌పాల్, బెన్‌హర్, సత్తయ్య, దాస్, సంజీవ, రాము, క్రాంతి, కార్తీక్, సుదర్శన్ పాల్గొన్నారు.

## ఘనంగా శత ఘటాభిషేకం



మల్కాజిగిరి: కుర్తాళ సిద్దేశ్వరీ పీఠపాలిత వారాహీ, ప్రత్యంగిరా సహిత షిరిడీసాయిబాబా మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి శతఘటాభిషేకం, వారాహీ ప్రత్యంగిరా హోమం, సామూహిక కుంకుమార్చన, అనంతరం ప్రసాద వితరణ జరిగింది. నేడు మహాపూర్ణాహుతి, కుంభ సంప్రోక్షణ, అన్నాభిషేకం, పల్లకీసేవతో కార్యక్రమం పూర్తవుతుందని పీఠం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. కమిటీ సేవా సభ్యులు రామకృష్ణ, లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, రాములు భక్తులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం



ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: నాచారం సాయిబాబా దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న అభయాంజనేయస్వామి, గణపతి శిఖరం, యంత్రస్థాపన, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వానించారు. ఆలయ కమిటీ సభ్యులు, మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్‌రావు, దామోదర్‌రెడ్డి, హరికృష్ణరెడ్డి తదితరులున్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

మల్లాపూర్: నాచారం సావర్కర్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు వేయాలని వినతిపత్రంలో కోరారు. నాచారం చౌరస్తాలో ఉన్న మైనార్టీ పాఠశాల డ్రైనేజీ నీరు సావర్కర్‌నగర్ వైపు వస్తుందని, మురుగు సమస్యను పరిష్కరించాలన్నారు. కాలనీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, లక్ష్మారెడ్డి, అర్జున్‌రావు తదితరులున్నారు.



కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

# స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి



నిరసనలో డాక్యుమెంట్ రైటర్లు

ఉప్పల్/రామంతాపూర్: తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రామంతాపూర్‌లోని ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శనివారం డాక్యుమెంట్ రైటర్ల సంఘం బంద్ పాటించి నిరసన తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు జన్నాల్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి రామకృష్ణగౌడ్‌లు మాట్లాడుతూ.. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధిగా తాము డాక్యుమెంట్ ప్రిపరేషన్ సెంటర్లు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంటే, అది కూడా ఓర్వలేని ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం ప్రవేశపెట్టిందని, దీంతో తమ బతుకులతో పాటు తమ సెంటర్లలో పనిచేసే సిబ్బంది కూడా రోడ్డున పడ్డారని వాపోయారు. ఒకవేళ స్లాట్ బుకింగ్ విధానం ఇదే విధంగా అమలైతే లక్షల మంది నిరుద్యోగులుగా తయారవుతారని వారు పేర్కొన్నారు. వెంటనే స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్స్ రంగ నందీశ్వర్‌గౌడ్, మోత్కూరి అరవింద్‌శర్మ, ప్రభాకర్, జగదీష్‌లాల్, శ్రీకాంత్‌రెడ్డి, సుభాష్, సాయి, శేషు, కృష్ణ తదితరులున్నారు.

## మల్లాపూర్‌లో పాలీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారి ఉమాగౌరీ

మల్లాపూర్: భవానీనగర్ కమాన్ ఎదురుగా ఉన్న లక్ష్మీవేంకటేశ్వర పాలీ క్లినిక్‌ను శనివారం మేడ్చల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తనిఖీలు చేపట్టారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నిబంధనలు, రిజిస్ట్రేషన్ లేకపోవడంతో జిల్లా వైద్యాధికారి ఉమాగౌరీ తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నందుకు సీజ్ చేశామన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సినీనటి సందడి



పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరైన నటి ప్రగతి

రామంతాపూర్ : జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండోరోజు శనివారం ముగింపు వేడుకలకు సినీనటి ప్రగతి హాజరై సందడి చేశారు. అనంతరం ఆమె పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పవర్ లిఫ్టింగ్‌లో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

రామంతాపూర్ : చిలుకానగర్ డివిజన్‌లోని బీరప్పగడ్డ, బొమ్మల బస్తీలో నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీ



చర్లపల్లిలో ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: పార్లమెంట్‌లో రాజ్యాంగాన్ని అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శనివారం జైబాపు, జైభీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి డివిజన్, జమ్మిగడ్డ, జేజే కాలనీ, నెహ్రూనగర్, భరత్‌నగర్, విరాట్‌నగర్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ విశిష్టత, అంబేద్కర్, బాపు మహోన్నతుల గొప్పదనాన్ని వివరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నీరజారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, గోపాల్ యాదవ్, రఘు తదితరులున్నారు.

**భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథం..**

గౌతంనగర్: ఇందిరానెహ్రూనగర్‌లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ హాజరై మాట్లాడుతూ.. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వారి ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందని ఆరోపించారు. గాంధీ, అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, బీకే.శ్రీనివాస్, నాగరాజు, రామచంద్రయ్య, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్, ఫరీద్, పరమేష్, రాములుగౌడ్, ఇస్తారి, సాయి, రాము తదితరులున్నారు.

# మహిళా సాధికారతకు కృషి



సెట్విన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ మేయర్

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తుందని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. చెంగిచర్లలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్‌తో కలిసి సెట్విన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3 నెలల పాటు కంప్యూటర్ కోర్సులు, ప్రైమరీ టీచర్ ట్రెనింగ్, మగ్గం వర్క్స్, కుట్టుమిషన్ ట్రెనింగ్, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషన్ ట్రెనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సెట్విన్ సంస్థ ఇన్‌చార్జి సహజాన్ సుల్తానా, మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, సమతాయాదవ్, మాజీ వార్డు సభ్యులు శివశంకర్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఈఈ నాగేందర్

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో ఫేజ్-2లో ఈఈ నాగేందర్, ఏఈ స్రవంతి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాక్స్‌డ్రైన్, సీసీరోడ్లు తదితర సమస్యలను స్థానికులు ఈఈకి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన గ్రీన్‌హిల్స్ కాలనీలోని బాక్స్ డ్రైన్, సీసీ రోడ్లను వేయిస్తామని చెప్పారన్నారు. మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పెర సాయికిరణ్‌గౌడ్, బాలరాజ్, మనోహర్, రాంపల్లి సాయి, గుడిసె సాయి, వినేష్ యాదవ్, విజయ్, అల్తాఫ్, మహేష్, సురేందర్, ప్రకాష్ తదితరులున్నారు.

# అనారోగ్యంతో జాతీయ కబడ్డీ క్రీడాకారుడి మృతి



దుబ్బాకుల కుమార్‌గౌడ్ (ఫైల్)



బిహార్ జంషెడ్‌పూర్‌లో ట్రోఫీని అందుకుంటున్న కుమార్‌గౌడ్

మల్లాపూర్: మల్లాపూర్‌కు చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కుమార్‌గౌడ్ (70) అనారోగ్యంతో మృతి చెందాడు. 1975లో బిహార్ జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ జూనియర్ స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. స్పోర్ట్స్ కోటాలో ఈసీఐఎల్‌లో ఉద్యోగం పొందారు. మల్లాపూర్ శాంతి యూత్‌క్లబ్ సభ్యుడిగా ఉంటూ రంగారెడ్డి, హైదరాబాద్ జట్టులో రాష్ట్రం తరపున టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. శాంతి యూత్ క్లబ్‌లో క్రియాశీల సభ్యుడిగా వివిధ క్రీడా సేవా కార్యక్రమాల్లో పలుపంచుకున్నారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నివాళులర్పించారు.

# సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని కానాజీగూడ గ్రీన్‌ఫీల్డ్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ తీర్మానించింది. శనివారం కాలనీలోని కార్యాలయం ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా.. పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా కోర్టు వివాదాలను త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నూతన సభ్యులను చేర్చుకోవడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణకు తీసుకోవాల్సిన పలు అంశాలను సమావేశంలో చర్చించారు.

# పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

**హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**



ఉప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు

ఉప్పల్/రామంతాపూర్ : వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు మాట్లాడుతూ.. బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని, హిందువులపై దాడులకు తెగబడుతున్న జిహాదీ మూకలను వెంటనే అరెస్టు చేసి బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి భానుప్రసాద్, శ్రీనివాస్, రాఘవేందర్, రమేష్‌నాయుడు, రమేష్‌రెడ్డి, రమేష్, సునీల్‌నాయక్, అరవింద్, కృష్ణవేణి, ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ఫణీందర్, బలవంతచారి, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి: హిందువులపై తరుచు దాడులు జరుగుతున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు డివిజన్ పరిధిలోని ఎంజే కాలనీలో బీజేపీ శ్రేణులతో కలిసి శనివారం నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బెంగాల్ రాష్ట్రంలో హిందువులకు రక్షణ కల్పించాలని, వక్ఫ్ బిల్లు పేరుతో హిందువులను అత్యంత దారుణంగా హింసకు గురిచేయడం తగదన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, నాయకులు సాయిబాబా, ప్రసాద్‌చౌదరి, ఫణీంద్రశర్మ, శ్రీనివాసయాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వీహెచ్‌పీ నాయకులు ఖండించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం ఆనంద్‌బాగ్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, సునీతాయాదవ్, నాయకులు శివానంద్, రజనీకాంత్, రాజిరెడ్డి, గోపాల్‌చారి, బక్క నాగరాజు, వీకే. మహేష్, కిరణ్ తదితరులున్నారు



ఫ్లకార్డులతో నిరసన చేస్తున్న కార్పొరేటర్ సునీతాశేఖర్, బీజేపీ నేతలు



ఆనంద్‌బాగ్‌లో..